క్లుప్తంగా

1.18 కోట్ల పనిదినాలే లక్ష్యం

మనుబోలు: జిల్లాలో ఈ ఏడాది 1.18 కోట్ల పనిదినాలే లక్ష్యమని డ్వామా పీడీ వెంకట్రావు పేర్కొన్నారు. మండలంలోని పిడూరులో రూ.1.5 లక్షలతో నిర్మిస్తున్న క్యాటిల్ పాండ్‌ను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు గానూ ఎండిపోయిన చెరువుల్లో నీటి గుంతలను తవ్విస్తామన్నారు. ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. కనీస వేతనంగా రూ.257 అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి స్థానికులు కోరిన పనులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. వీలు బట్టి రెండు పూటలా పనులు చేసుకోవచ్చన్నారు. ఏపీఓ రాజమ్మ, టీఏలు సుప్రజ, రమేష్, ఎఫ్ఏలు వేణు, శ్రీనివాస్, హరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల ద్వారా మెరుగైన సేవలు

కోవూరు: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన పురుగు మందులను సరఫరా చేయడమే కాకుండా మెరుగైన సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అమరావతి డీడీఏ మురళి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని డాక్టర్ వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌ను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 110 ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని, అతి త్వరలో మరో 65 అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. కోవూరులో ఇప్పటి వరకు 112 పరీక్షలు చేశారన్నారు. ల్యాబ్ టెస్ట్ చేసే సిబ్బంది తొమ్మిది రకాల సూచనలను తప్పక పాటించాలని పేర్కొన్నారు. పుస్తక నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. రైతులకు సంబంధించిన ప్రతి అంశం వ్యవసాయాధికారులకు తెలిసి ఉండాలని చెప్పారు. ఏడీఏ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో న్యాయవిజ్ఞాన సదస్సు

ఇందుకూరుపేట: మండలంలోని నరసాపురంలో న్యాయ విజ్ఞాన సదస్సును సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ యామిని ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయసేవాధికార సంస్థల ద్వారా ఉచిత న్యాయసేవలను అందిస్తున్నామని వివరించారు. వీఆర్వో నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కోవూరు: బ్యాంకులు అందిస్తున్న సేవలపై రైతులు అవగాహన పెంచుకోవడంతో పాటు వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆర్థిక అక్షరాస్యత జిల్లా కో ఆర్డినేటర్ రవిశంకర్ పేర్కొన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై రైతులు, ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాన్ని కోవూరులోని శాంతినగర్‌లో గల పడుగుపాడు సహకార పరపతి సంఘ సమావేశ మందిరంలో ఆర్బీఐ సూచనల మేరకు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు, ఖాతాదారులు కేవలం నియంత్రణ సంస్థల నుంచే రుణాలను తీసుకోవాలని కోరారు. డిజిటల్ సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడారు. సొసైటీ ద్వారా ఇప్పటి వరకు రూ.మూడు కోట్ల మేర బంగారు రుణాలను అందజేశామని వెల్లడించారు. కో ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ సుధాకర్, సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.20 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు



ముత్తుకూరు: జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.20.93 కోట్లతో 54 పనులను మండలంలో చేపట్టామని అధికారులు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ సుగుణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మధుసూదన్ మాట్లాడారు. నాడు – నేడు రెండో విడత ద్వారా మండలంలోని 50 పాఠశాలల రూపురేఖలను మారుస్తున్నామని, దీనికి ప్రభుత్వం రూ.12 కోట్లను వెచ్చిస్తోందని వివరించారు. 8వ తరగతి విద్యార్థులకు 527 ట్యాబ్‌లను పంపిణీ చేశామని చెప్పారు. పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కార్యాచరణను రూపొందిస్తున్నామని వెల్లడించారు. అనంతరం మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి మాట్లాడారు. రబీ సీజన్లో మండలంలో 9200 ఎకరాల్లో వరి, వేరుశనగను సాగు చేస్తున్నారన్నారు. పురుగు మందుల పిచికారీ కోసం 40 శాతం రాయితీపై డ్రోన్లను పంపిణీ చేస్తామన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ, పీఆర్, పొదుపు సంఘాల పని తీరుపై సమీక్షించారు. ఎంపీడీఓ ప్రత్యూష, తహసీల్దార్ మనోహర్‌బాబు, మండల ఉపాధ్యక్షులు చిన్నపరెడ్డి, విజయలక్ష్మి, హార్టికల్చర్ వర్సిటీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

• డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు (అర్బన్): కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని ముందస్తు జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. కేన్సర్ వ్యాధి నివారణపై విద్యార్థులతో సైకిల్ ర్యాలీని ట్రంక్‌రోడ్డులో ఎన్సీడీ విభాగ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. జీవన శైలిలో మార్పు, ఆహార అలవాట్లలో తేడాలు, సరైన వ్యాయామం లేకపోవడంతో కేన్సర్ వస్తోందని చెప్పారు. మంచి ఆహార అలవాట్లతో పాటు ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా కేన్సర్ రాకుండా నివారించుకోవచ్చని తెలిపారు. డెమో అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూములుగా గుర్తించాలని వినతి



కలెక్టరేట్ వద్ద రైతుల ఆందోళన

నెల్లూరు(అర్బన్): ఏళ్లగా సాగు చేసుకుంటున్న తమ భూములను రీ సర్వేలో అధికారులు ప్రభుత్వ భూములుగా చూపారంటూ బోగోలు మండలం ఉమామహేశ్వరపురానికి చెందిన పలువురు రైతులు కలెక్టరేట్ వద్ద ఆందోళనను మంగళవారం చేపట్టారు. జేసీ కూర్మనాథ్‌కు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం రైతులు వెంకయ్య, రాజేష్ మాట్లాడారు. తాము సాగు చేసుకుంటున్న భూములకు దశాబ్దాల క్రితమే పట్టాలను ఇచ్చారని చెప్పారు. అవి ఒకరిద్దరి చేతులు మారాయని, రిజిస్ట్రేషన్లు సైతం జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం రీ సర్వేలో అధికారులు ప్రభుత్వ భూములుగా చూపుతుండటం తగదన్నారు. సదరు భూములును పట్టా భూములుగా గుర్తించాలని కోరారు. రైతులు కృష్ణయ్య, ప్రసాద్, మురళి, చైతన్య, శ్రీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ ఏటీఎం కేంద్రం ప్రారంభం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్టోన్‌హౌస్‌పేటలోని తడికలబజార్ సెంటర్‌లో డీసీసీబీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏటీఎం సెంటర్‌ను సీఈఓ శంకర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖాతాదారుల సౌకర్యార్థం ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభించామని వివరించారు. జీఎం సరిత, ఆప్కాబ్ అధికారి శ్రీనివాస్, ఏజీఎం మధుసూదన్‌రావు, డీసీసీబీ స్టోన్‌హౌస్‌పేట బ్రాంచ్ మేనేజర్ శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓను కలిసిన నేతలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గంగా భవాని, తదితరులు

నెల్లూరు (టౌన్): నగరంలోని జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డీఈఓ గంగా భవానీని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ నేతలు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడారు. విద్యా రంగంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు యత్నిస్తామని చెప్పారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయులు కష్టపడి పనిచేయాలని కోరారు. అనంతరం వచ్చే నెల ఐదు, ఆరో తేదీల్లో నిర్వహించనున్న ఏపీయూఎస్ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను డీఈఓ ఆవిష్కరించారు. ఏపీయూఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాజగోపాలాచార్యులు, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

జాతరకు అనుమతులివ్వరూ..

నెల్లూరు రూరల్: వచ్చే నెల్లో నిర్వహించతలపెట్టిన సింహపురి గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి జాతరకు అనుమతులివ్వాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు విజయవాడలోని దేవదాయ శాఖ కమిషనర్‌కు లేఖను మంగళవారం ఆయన పంపారు.

జనహిత – వాత్సల్యకు విరాళం



నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని జనహిత – వాత్సల్య ఆశ్రమ భవన సముదాయాల మరమ్మతుల నిమిత్తం రూ.20 లక్షల విరాళాన్ని జేమ్స్‌గార్డెన్‌కు చెందిన సుభాషిణి తన భర్త జనార్దన్‌రెడ్డి జ్ఞాపకార్థం మంగళవారం అందజేశారు. ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో జనహిత – వాత్సల్య సంఘటన కార్యదర్శి సాంబశివరావు, కార్యనిర్వాహక సభ్యుడు హరికుమార్‌రెడ్డికి ఇచ్చారు. అడ్వొకేట్ గంగాధర్‌రెడ్డి, విజయలక్ష్మి, రఘునాథరాజు, తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి సొత్తు అపహరణకు గురైందని ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): విశ్రాంత మైనింగ్ జేడీ ఇంట్లో చోరీ ఘటనలో రూ.కోటికిపైగా సొత్తు అపహరణకు గురైందంటూ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కొండాయపాళెం గేట్ మిలటరీ కానీ పార్కు వీధిలో విశ్రాంత మైనింగ్ జేడీ జకర్యా కుటుంబం నివాసం ఉంటోంది. ఐదంతస్తుల భవనంలో కింది పోర్షన్లో ఆయన ఉండగా, మిగిలిన వాటిని అద్దెకిచ్చారు. కొంతకాలంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఆయన అప్పుడప్పుడూ నెల్లూరొచ్చి వెళ్లేవారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు వారి ఇంటి వెనుక భాగంలో ఉన్న తలుపు తాళాన్ని పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా, అల్మారాల్లోని నగదు, నగలను అపహరించుకెళ్లారు. విషయాన్ని గమనించిన అద్దెకున్న వారు బాధితుడికి సమాచారం అందించారు. దర్గామిట్ట పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. యజమాని కుమారుడు ధీరజ్ నెల్లూరుకు మంగళవారం చేరుకున్నారు. బీరువా, అల్మారాల్లోని రూ.కోటికిపైగా విలువ జేసే బంగారు ఆభరణాలు, నగదును అపహరించుకెళ్లారని దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసును విచారిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య తెలిపారు.

ఆశ కార్యకర్తల ధర్నా



నెల్లూరు(అర్బన్): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనంగా రూ.26 వేలను ఇవ్వాలంటూ ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయం వద్ద ధర్నాను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నపూర్ణమ్మ మాట్లాడారు. అనంతరం డీఎంహెచ్‌ఓ పెంచలయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, మధుసూదన, భాగ్యరేఖ, సుజాత, భువనేశ్వరి, సుభాషిణి, నారాయణమ్మ, ధనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం వివాహితను వేధించడంతో పాటు దాడి చేసిన వారిపై బాలాజీనగర్ పోలీసులు కేసును మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ముత్యాలపాళేనికి చెందిన రాజేశ్వరికి కృష్ణప్రసాద్‌తో 2018లో వివాహమైంది. కొంతకాలం వీరు సంతోషంగా జీవించారు. అనంతరం కలతలు చోటుచేసుకున్నాయి. అదనపు కట్నం కోసం రాజేశ్వరిని కృష్ణప్రసాద్, అతని తల్లిదండ్రులు, తమ్ముడు వేధించసాగారు. ఇటీవల ఆమెపై దాడి చేసి చంపుతామని బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాత్‌రూమ్‌ను వాడొద్దన్నందుకు..

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో నిందితురాలిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సావిత్రినగర్‌లో కృష్ణయ్య కుటుంబం నివాసం ఉంటోంది. అద్దె ఇంట్లో కింది పోర్షన్లో వారు, పైన అనితమ్మ, ఆమె కుమార్తె ఉంటున్నారు. వారి ఇంట్లో బాత్‌రూమ్‌లు సక్రమంగా లేకపోవడంతో కృష్ణయ్య ఇంట్లోని వాటిని మూడు నెలలుగా వాడుకుంటున్నారు. దీన్ని వాడుకోవద్దని చెప్పినందుకు గానూ అతనిపై అనితమ్మ సోమవారం దాడి చేసి గాయపర్చారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఓ మహిళపై ఆమె భర్త మొదటి భార్య, కుమారుడు దాడి చేసిన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు కేసును మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఎన్టీఆర్‌నగర్‌లోని రాయపుపాళేనికి చెందిన రమణయ్యకు రాజేశ్వరితో గతంలో వివాహమైంది. కుటుంబకలహాల నేపథ్యంలో వీరు విడిపోయారు.

అనంతరం సుమతిని వివాహం చేసుకున్నారు. రాజేశ్వరి, ఆమె కుమారుడు శ్రీకాంత్ ఈ నెల ఐదో తేదీన రమణయ్య ఇంటికెళ్లారు. అక్రమంగా ప్రవేశించి అందులో ఉన్న సామగ్రిని తీసుకెళ్తుండగా, సుమతి అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన వారు ఆమెపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇరువర్గాల దాడులు

నెల్లూరు(క్రైమ్): ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న ఘటనపై నవాబుపేట పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కుసుమ దళితవాడకు చెందిన ప్రణీత్ ఉడ్‌హౌస్‌సంఘంలోని బొరుగల అంగడిలో పనిచేస్తున్నారు. ఉడ్‌హౌస్‌సంఘానికి చెందిన చిన్నా, మహేష్, సుమంత్ అకారణంగా అతనితో సోమవారం గొడవపెట్టుకొని దాడి చేసి గాయపర్చారు. విషయం తెలుసుకున్న అతని స్నేహితుడు చంద్రశేఖర్ ఘటన స్థలానికి చేరుకుని వారి నుంచి రక్షించేందుకు యత్నించారు. దీంతో అతనిపై సైతం దాడి చేశారు. ఈ మేరకు పోలీసులకు చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు. కాగా గొడవ చేయొద్దని చెప్పినందుకు గానూ ప్రణీత్, చంద్రశేఖర్, శివమణి తనపై దాడి చేశారని ఉడ్‌హౌస్‌సంఘానికి చెందిన శాంతి ఫిర్యాదు చేశారు. ఇరు ఫిర్యాదులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

బంగారు వ్యాపారిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): రాత్రికి రాత్రే కుటుంబంతో సహా అదృశ్యమైన బంగారు వ్యాపారిపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరానికి చెందిన కిరణ్ చిన్నబజార్‌లో జ్యువెలరీస్‌ను నిర్వహిస్తున్నారు. తన సహచర వ్యాపారుల వద్ద బంగారు ఆభరణాలను తీసుకొని వాటిని విక్రయించిన అనంతరం దాని తాలూకు నగదును చెల్లించేవారు. ఇటీవల ఆయన కుటుంబంతో సహా అదృశ్యమయ్యారు. ఈ క్రమంలో తన వద్ద 630 గ్రాముల బంగారు ఆభరణాలను తీసుకొని మోసగించారంటూ గుప్తా పార్కుకు చెందిన భవానీ ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేశారు. కాగా కిలోల కొద్దీ ఆభరణాలను తీసుకొని పలువురు వ్యాపారులను మోసగించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బాధితులు ఎవరైనా ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని పోలీసులు కోరుతున్నారు.

పేకాట స్థావరంపై దాడులు

కోవూరు: పాటూరులోని పంట పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై స్పెషల్ టీమ్ మెరుపు దాడులను మంగళవారం చేపట్టింది. పేకాటాడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.95 వేల నగదు, 11 మొబైల్ ఫోన్లు, తొమ్మిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కృష్ణకిషోర్‌రెడ్డి, కోవూరు ఎస్‌ఈబీ సీఐ నరహరి, జేడీ టీమ్ ఎస్సై బాలకృష్ణ, శ్రీనివాస్, సిబ్బంది పాల్, మస్తానయ్య, శ్రీనివాసులు, రాజు, సుమతి, తులసి, తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై మూలస్థానేశ్వరుడు



నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో ధ్వజారోహణం, సింహ వాహన సేవను వేడుకగా మంగళవారం నిర్వహించారు. విశేషాలంకారంలో కొలువైన స్వామివారిని భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలుగా వరద రాజులు, శివకుమార్, శ్రీనివాసులు, కోటిగౌతమ్ వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు చప్పరోత్సవం, రాత్రి ఏడుకు పురుషామృగ వాహనసేవను నిర్వహించనున్నారు.

గీతామయి వృద్ధాశ్రమానికి చేయూత



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమానికి చిన్నారి హార్ట్ ఫౌండేషన్ చేయూతనందించింది. ఆశ్రమంలోని 60 మంది వృద్ధులకు దుప్పట్లు, పండ్లను ఫౌండేషన్ చైర్మన్, రత్నం విద్యాసంస్థల అధినేత రత్నం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకుడు పాండుకు రూ.16,108 చెక్కును ఆయన అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు నరసింహులునాయుడు, గంగాధర్, సుధాకర్, శాంతిలాల్, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తే దహనానికి కారకుడు



వివరాలను వెల్లడిస్తున్న శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): నగరంలోని టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని తగలబెట్టింది మతిస్థిమితం లేని వ్యక్తి అని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రకాశం పంతులు విగ్రహానికి కప్పి ఉంచిన గుడ్డకు నిప్పంటుకొన్న ఘటనకు సంబంధించిన వివరాలను చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబుతో కలిసి తన కార్యాలయంలో మంగళవారం ఆయన వెల్లడించారు. మూలాపేటకు చెందిన సాహిల్ రామాని జైన్ బీబీఏ వరకు చదువుకొని ఏడేళ్లుగా మతిస్థిమితం లేకుండా బాధపడుతున్నారు. నెల్లూరు, విశాఖ, చెన్నైల్లో చికిత్స చేయించినా పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. ఈ నేపథ్యంలో మద్రాస్ బస్టాండ్ సెంటర్‌కు ఆయన సోమవారం రాత్రి వచ్చారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి కప్పి ఉంచిన గుడ్డకు లైటర్‌తో నిప్పంటించారు. దీంతో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న చిన్నబజార్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న స్థానికులతో కలిసి మంటలను ఆర్పారు. ఘటనకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

విద్యార్థినికి అభినందన



నెల్లూరు(బృందావనం): నాట్యంలో అద్భుత ప్రదర్శనతో అవార్డులను అందుకున్న ఏసీనగర్‌కు చెందిన విద్యార్థిని లాస్యశ్రీని మంగళవారం సత్కరించారు. ఏసీనగర్‌లోని శ్రీచైతన్య స్కూల్లో మూడో తరగతి చదువుతున్న లాస్యశ్రీ గతేడాది డిసెంబర్‌లో ఢిల్లీలో నిర్వహించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నాట్య ప్రదర్శనలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ చూపారు. అదే విధంగా మహాబలిపురంలో నిర్వహించిన జాతీయ స్థాయి నాట్య పోటీల్లో శివనంది అవార్డును అందుకున్న నేపథ్యంలో స్కూల్ ఏజీఎం శ్రీకాంత్, విద్యాసంస్థల ప్రిన్సిపల్స్ ప్రవీణ్, వినయ్, పుష్ప, తదితరులు అభినందించారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి



నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమాన్ని యునైటెడ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత, గిరిజన సంఘాల నేతలు అరుణాచలం, సుబ్బారావు, సుబ్బరాయుడు, జయరాజ్, పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, ప్రమీలమ్మ, నిర్మలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు అత్యధిక వడ్డీ



మాట్లాడుతున్న శంకర్‌బాబు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సూపర్ సీనియర్ సిటిజన్ల కోసం నూతన పథకాన్ని డీసీసీబీలో బుధవారం ప్రారంభించనున్నామని సీఈఓ శంకర్‌బాబు పేర్కొన్నారు. గాంధీబొమ్మ సెంటర్ సమీపంలోని డీసీసీబీలో గల తన చాంబర్‌లో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. 80 ఏళ్లపైబడిన సీనియర్ సిటిజన్ల కోసం సూపర్ సీనియర్ సిటిజన్ల డిపాజిట్ పథకాన్ని ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. నగదు డిపాజిట్లపై అత్యధికంగా 8.25 శాతం వడ్డీని అందించనున్నామని చెప్పారు. సాధారణ డిపాజిట్లపై అదనంగా 0.5 శాతం వడ్డీని అందించనున్నామని వివరించారు. 271 నుంచి 364 రోజుల వరకు డిపాజిట్ చేస్తే గతంలో 5.5 శాతం వడ్డీని చెల్లించేవారమని, దీన్ని ఆరు శాతానికి పెంచామని పేర్కొన్నారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు డిపాజిట్ చేసిన వారికి 6.5 నుంచి ఏడు శాతం, రెండేళ్లు, ఆపైన 7.5 శాతం వడ్డీని అందించనున్నామన్నారు. వ్యవసాయ రుణాలకు సంబంధించి గ్రాము బంగారానికి రూ.3500తో రూ.ఐదు లక్షల వరకు రుణాన్ని 7.95 శాతం వడ్డీకి ఇస్తామన్నారు. వ్యవసాయేతర అవసరాలకు బంగారు ఆభరణాలపై తొమ్మిది శాతం వడ్డీతో రూ.20 లక్షల వరకు రుణాలను అందించనున్నామన్నారు. మొబైల్ బ్యాంకింగ్, లాకర్ సదుపాయాలున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిబంధనలను పక్కాగా అమలు చేయండి



మొక్కలు నాటుతున్న అధికారులు

నెల్లూరు(క్రైమ్): ఎక్సైజ్ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని, ఉల్లంఘనలపై చర్యలు చేపట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి ఆదేశించారు. బీవీనగర్‌లోని ఆ శాఖ కార్యాలయంలో అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బార్లు నిర్ణీత వేళలు పాటించేలా చూడాలని, కల్తీ విక్రయాలు జరగకుండా నిరోధించాలని సూచించారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజిలెన్స్ డీఎస్సార్ మూర్తి, జిల్లా ఎక్సైజ్ అధికారి వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.